# రాంగ్ షో

- జైరాజ్



కథా నిలయ
శ్రీకాకుళం

ఊబిలో కూరుకు పోయింది కోమలి.

ఊడి రావాలన్న ఆశాబీజం ఆమెలో ఉన్నా, ఆ బీజానికి అంకురం లేదన్న సంగతి ఆమెకే తెలుసు.

విధిలిఖితం అనే మాట కొందరిపట్ల వాస్తవం అనడానికి కోమలి జీవితం ఒక నిదర్శనం.

పల్లెటూరి పంతులు రామానుజం పెద్ద కూతురు కోమలి.

రామానుజం పదవీ విరమణ చేసేనాటికి, ఆయనకు మిగిలిన ఆస్తి కోమలితో కలిపి నలుగురాడపిల్లలు.

నిండు జీతం చేతికందుతున్న రోజుల్లోనే గుట్టుమట్టుగా బ్రతికి గౌరవాన్ని నిలబెట్టుకున్న కుటుంబమది.

కొద్దిపాటి పింఛనుతో బ్రతకడం కష్టమని కొన్ని ట్యూషన్లు కుదుర్చుకొని ఆ లోటు భర్తీ చేసుకున్నాడు రామానుజం.

అయినా ధైర్యం చాలక అద్దె ఇల్లు వదలి ఒక రైతుని 'బాబూ, నాయనా' అని, అతడి అనుమతితో అతడి ఖాళీ జాగాలో చిన్న పాకేసుకున్నాడు.

"ఆడపిల్లకు ఎందుకొచ్చిన చదువుల్లేవే" అని 8 వ తరగతి చదువుతున్న కోమలిని చదువు మాన్పించాడు- ఏ ఖర్చు తగ్గినా తగ్గినట్టే అని.

మిగిలిన వాళ్ళింకా చిన్న పిల్లలు.

"అయినప్పుడు దానికా మూడు ముళ్ళూ వేయించేద్దురూ!" అనేది భార్యామణి. వేయించాలంటే ఉన్న సాధక బాధకాలు రాఘవమ్మకు తెలియకపోలేదు. అయినా తల్లిగా తన బాధ్యత గనుక హెచ్చరించేది.

రాజకుమారుడెవడో వస్తాడని కలలు గనలేదు. నవమన్మథుడొస్తాడని ఆశించలేదు గానీ సామాన్యుడెవరితోనో ఒకరితో తన జీవితం ముడివడబోతోందని మురిసిపోయింది కోమలి.

ఆ వయసుకు దగ్గ కోర్కెలతో, ఆ సామాన్యుడితో రంగు రంగుల జీవితాన్ని కోమలి ఊహించుకొంటున్న రోజులవి.

రాఘవమ్మ పోరు పడలేక అటొక రోజు ఇటొక రోజు రామానుజం చెప్పు లరిగేలా తిరుగుతున్న రోజులవి.

కోమలి ఆశలు పెరిగిపోతున్న రోజులవి.

ఆ రోజుల్లో ఒక రోజు ఆమె ఆశలు మొగ్గలోనే త్రుంచబడ్డాయి. ఆమె కలలు కరిగిపోయాయి.

ఆమెదే కాదు ఆ కుటుంబ జీవి తమే తారుమారైంది.

ఏదో పనిమీద టౌనుకని నడచి వెళుతున్న రామానుజం అకాల మృత్యువు వాతబడ్డాడు. కారు క్రిందబడి నలిగిపోయాడు. తప్పించుకోవడానికి ఆ ఘడియకు అచటి పరిస్థితులు అనుకూలంగా వున్నాయి కాబోలు, ఆ డ్రైవరెవడో కారు ఆపకుండా ఉడాయించాడు.

రోడ్డుమీది శవం గుర్తింపబడింది.

"అమ్మా! మేష్టారు...." అని దుర్వార్త చెప్పలేక చెప్పారెవరో.

ఆ కుటుంబమంతా గొల్లుమంది.

నలుగురూ గుమిగూడి ఓదార్చారు.

నాలుగు రోజులు కొందరు వారి ఆలనా పాలనా చూశారు.

కొద్దిమంది ఉదారులు ధారాళంగాను, మిగిలిన వారు తోచినకాడికి తోచినంత చందాలు వేసుకొని మొత్తం మీద 200 విరాళంగా రాఘవమ్మ చేతికందించి చేతులు కడుక్కొన్నారు.

సానుభూతి మాటల్లోనైతే ఎంతైనా కురిపించవచ్చు. చేతల్లో కొచ్చేసరికే దానికో హద్దు ఏర్పడుతుంది. ఎంత చెట్టుకు అంత గాలి మరి. ఎవరి కష్టాలు వారివి.

ఆ రెండువందలు ఖర్చయ్యేలోగా, ముందు బ్రతుకుతెరువు కేదో మార్గమాలోచించుకోమని సలహా ఇచ్చారు.

ఆలోచించుకోగలిగిన వారు ఆ కుటుంబంలో ఇద్దరు–

రాఘవమ్మ, కోమలి.

లలిత, సరిత, విమల వరుసగా 12,10,7 సంవత్సరాల పసివాళ్ళు.

రాఘవమ్మ ముందు తరానికి చెందిన మనిషి. వ్రాయనూ చదువనూ వచ్చుగాని చదువరిని అని చెప్పుకోదగ్గ చదువు ఆమెకు లేదు. ఈ కుటుంబ భారాన్ని మోయాలంటే ఆమె కళ్ళముందు మెదిలాడుతున్నది ఏ ఇంటనైనా చాకిరీ- అయితే ఆమెలో ఉన్న శక్తి అంతంత మాత్రం. అయినా మిగిలినదదొక్కటే దారి, అనే నిర్ణయానికొచ్చిన రాఘవమ్మకు ఆ వూళ్ళో చాకిరీ చేయించుకోగలిగిన స్తోమతున్న ఇళ్ళు వేళ్ళమీద లెక్కకొచ్చాయి. ఈ నాలుగిళ్ళలో ఎక్కడో ఒక చోట తప్పదు అనుకొన్నాక "తల్లీ!" అని కోమలిని కేకేసి తన నిర్ణయాన్ని చెప్పింది.

"అమ్మా!" అని తల్లిని వాటేసుకొని "వద్దమ్మా-వద్దు" అని రోదించింది కోమలి.

"వద్దంటే ఎలా తల్లీ!" అని

రాఘవమ్మంటే "నేనున్నానమ్మా! ఆ చాకిరీ ఏదో నేనే చేసుకొస్తాను" అన్నది కోమలి.

తల్లీకూతుళ్ళు కొంత తడవు నేనంటే నేనని వాదులాడుకున్నాక తుది విజయం కోమలిదే అయ్యింది.

ఆ ఊర్లో మునసబుగారు బాగా కలిగినవాడు.

"ఆయన భార్య నాగమణిని ఆశ్రయించి "తప్పదమ్మా! మరో గత్యంతరం లేదు" అని విషయం చెప్పి కన్నీళ్ళు తుడుచుకొంది కోమలి.

ఎలా బ్రతికిన కుటుంబానికి ఎలాంటి గతి పట్టిందోనన్న సాను భూతితో "అలాగేనమ్మా కోమలీ, పదిమంది సిబ్బంది మా ఇంట ఉండనే ఉన్నారనుకో. దాని మాట కేముచ్చెలే, ఏదో మిగులూ తగులూ కలిసి మా ఇంట ఒక మనిషికి తిండి ప్రతి పూటా అదే సరిపోతుంది. కాబట్టి పైన ఓ పది రూపాయలిస్తాను. మరి నీ ఇష్టం. అంతకు మించి నాకు శక్తి లేదు. అదైనా వారి చెవిని వేశాకనే సుమా" అన్నది నాగమణి.

మిగులూ తగులూ తినాల్సిన గతి పట్టిందా అనుకున్నందుకు దుఃఖాశ్రువులు. పది రూపాయల పాటు దొరికింది, అదే పది వేలు అనుకున్నందుకు ఆనందాశ్రువులు కలిసి ఉబికిరాగా కోమలి ఉక్కిరి బిక్కిరై "అలాగేనమ్మా! అలాగే. రేపట్నుండి పనిలోకి రానా?" అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకొంది.

"వారిని నేను 'ఊ' అనిపిస్తాలే. అలాగేరా. బాధపడకమ్మా, కష్టాలు కలకాలముండవులే" అని కోమలి కళ్ళలో బాధను గుర్తించిన నాగమణి ఓదార్చింది.

చేసుకుపోతోంది చాకిరీ కోమలి.

కోమలి మీద ముకుందరావు కన్ను బడింది.

పడిన కన్ను మహా చెడ్డది.

కోమలి కను చూపు కోసం ఎదురుచూపింది.

దించిన తల ఎత్తేదిగాదు కోమలి.

ఒక రోజు ముకుందం కళ్ళతో పొరపాటున తన కళ్ళు కలిసి నప్పుడు అతగాడి చూపుల్లోని భావాలు గ్రహించి చెదిరిపోయింది కోమలి.

ఆ రోజు నుండి మరింత జాగ్రత్త పడింది కోమలి.

ముకుందరావు మునసబుగారి అబ్బాయి.

పరమ రౌడీ అన్న విషయం కోమలికి తెలియదు.

మునసబుగారిల్లు పెద్ద లోగిలి.

ఒకనాడు కోమలిని కొట్టు గది లోకి లాగేశాడు ముకుందం. లాగి లా గ గా నే నోరు నొక్కేశాడు. పెనుగులాడింది కోమలి. ఆమెకు శ క్తి చాలలేదు. ఎవరైనా అటు వేపు రాకపోతారా,రక్షించకపోతారా అని ఆశించింది. ఎవ్వరూ రాకుండా ముందే ఏర్పాట్లు చేసుకున్నాడు ముకుందమని ఆమెకు తెలియదు.

ఆదేదో సుఖానుభూతి అని కలలుగన్న దాన్ని కర్కశంగా చవి చూపింది.

ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణచు కొంటున్న కోమలి కన్నీళ్ళు తుడి చాడు ముకుందం. కాలరాచినందుకు నష్టపరిహారం గాబోలు! పది రూపా యలు కోమలి చేతబెట్టాడు.

"బాబుగారూ!...." బావురు మన్నది కోమలి.

"ఊఁ, మకార్ చెయ్యకు. రా అనగానే రెడీగా వుండాలి తెలిసిందా? తడవకో పదిస్తాలే" అని వెకిలిగా నవ్వి, మొరటుగా కన్ను గీటాడు ముకుందరావు.

"బాబుగారూ! నన్నన్యాయం చేయకండి" అతడి పాదాలు తాకింది కోమలి.

"ఆమాట ముందేడవగూడదూ? ఇందా, మరో పది" అని ఓ పది కాగితం కోమలిమీదికి విసిరాడు. ఆ మనిషికి ఆడది 'అన్యాయం చేశావు' అనంటే 'ఇదో పదో తక్కువిచ్చాను కాబోలు!' అనే అర్థమే స్ఫురిస్తుంది మరి.

వెలవెలా బోయింది కోమలి.

"రావే, లం...." అంటూ మళ్ళీ కోమలిని ఆక్రమించాడు ముకుంద రావు.

"మళ్ళీ రేపు, ఇక్కడే .. తెలి సిందా?" అంటున్న ముకుందరావు ముఖంలో కనుపించిన కసిని గుర్తించిన కోమలి, కాదంటే ఏ తంటా వస్తుందో అనే భయంతో 'ఊఁ' అనేసింది.

అతడు "అదీ, అలాగుండాలి" అని మెచ్చుకోలుగా ఓ ముద్దిచ్చి నిష్క్రమించాడు.

నలిగిపోయిన కోమలి పెరటి త్రోవన తన ఇంటికి భారంగా చేరి పోయింది.

తనలో తాను కుళ్ళిపోయింది గానీ, తల్లితో ఏమీ చెప్పలేక పోయింది.

ఆ మరుపటి రోజు "అమ్మా, నాకీ పూట ఒంట్లో బాగాలేదు. నాగ మణి గారింటికి ఈ ఒక్కపూట నీవెళ్ళిరావూ?" అని తల్లిని ప్రతి మాలింది.

"నా తల్లే, వెళ్తానమ్మా!" అంటూ రాఘవమ్మ వెళ్ళింది.

నేరుగా ఇంటికే వచ్చాడు ముకుందరావు.

"కోమలీ! ఇలా రా" అన్న కేక విని అదిరిపోయింది కోమలి. చెల్లెళ్ళముందు వీడేమేమి వాగుతాడోనన్న భయం కొద్దీ భయపడుతూ భయపడుతూ బయటికే వెళ్ళింది. వెళ్ళకుంటే అతగాడు లోపలికి చొరబడే రకం అని ఆ పాటికే గ్రహించింది కోమలి.

"ఇలాంటి వేషాలేం నా దగ్గర సాగవోయ్. మీ అమ్మని పంపిస్తావా? సరేలే ఇవాల్టికేదో ఐపోయిందిగాని, రేపట్నుండి నీవేరా తెలిపిందా? రాకపోయావో నా సంగతింకా నీకు సరిగా తెలియదు. పదిరూపాయలు చేదటే? అయినా లంజా, వెర్రిదానివి గాకపోతే చాకిరీ చేస్తే పీ కొచ్చేదెంతే? ఔన్లే, ఆ విషయం తెలిసుంటే హాయిగా ఈ పాటికి వ్యాపారానికే దిగుందువు. వెర్రి మొఖమా! వస్తావుగదూ?" అని ఆఖరిమాట గద్దించి అడిగాడు.

తలూపక తప్పలేదు కోమలికి.

అతగాడు వెళ్ళాక నిలువెల్లా వాణికి పోయింది కోమలి. ప్రపంచాన్ని ఎరక్కపోయినా అతగాడన్న వ్యాపారమన్న మాటకు అర్థం తెలుసు కోమలికి — పుస్తకాల్లో అనేకం చదివింది కోమలి.

ఆ రోజంతా ఆందోళనతో గడిపి సతమతమైన కోమలి తెల్లవారేసరికి మాయమైంది. రాఘవమ్మను దుఃఖ సాగరాన ముంచి పోయింది.

"అమ్మా! నీకష్టాన్ని నేను చూడలేను. నా కష్టాన్ని భరించలేను! నుయ్యో గొయ్యో వెతుక్కుంటూ పోతున్నాను. నన్ను క్షమించు. నాకోసం దుఃఖించి, కృశించి, కృంగిపోకు. వెనుక చెల్లెళ్ళున్నారు. బలవన్మరణం పాలైన నా శవం నీ కళ్ళబడితే నీ గుండె బ్రద్దలౌతుందనీ, చస్తూ చస్తూ నీ కంతటి శిక్షవిధించగూడదనీ బహుదూరంగా పోతున్నాను- గోతులు వెదుక్కోడానికి. నా శవం కోసం వృధాగా వెతికించ వద్దని ప్రార్థిస్తున్నాను." అని చీటి రాసిపెట్టి పోయింది.

"కోమలీ, కోమలీ, తల్లీ కోమలీ...." రాఘవమ్మ దుఃఖం కట్టలు తెగింది.

ఆమె ఏడుపునుండే విషయం గ్రహించిన ఇరుగు పొరుగులు ఆమె చేతనున్న చీటి అందుకొని వివరాలు తెలుసుకున్నారు.

"అయ్యో, కోమలీ! ఎంతకి సాహసించావమ్మా!" అని నలుగురూ నిట్టూర్చారు.

ముకుందరావు చేసిన ఘోరం

బయటకి పొక్కలేదు గనుక ఏ ఒక్కరూ మరోరకంగా భావించ లేదు. 'పిల్ల బుద్ధిమంతురాలు. పాపం పసిది కష్టాలను సహించ లేక అలాంటి నిర్ణయం తీసుకుంది' అంటూ, 'పాపం ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరుపుతుందో' నని పలువురూ పలురకాల ఊహాగానం చేసి విచారించారు.

తల్లిగా తరువులూ, తటాకాలూ వెదికింది రాఘవమ్మ. కంట తడి ఆరిపోయిందాకా దుఃఖించింది పాపం రాఘవమ్మ.

"ఏమో! నా బిడ్డ ఆఖర్న తన నిర్ణయం మార్చుకుందేమో? తిరి గొస్తుందేమో!" అనే ఆశను వ్యక్తం చేసింది రాఘవమ్మ అంతబాధలోను.

"అంత అదృష్టమా?" అని సందే హించిన వారే ఎక్కువయ్యారు.

దెబ్బమీద దెబ్బ తిన్న ఆ కుటుంబం దిక్కుతోచనట్టుపడుంటే మరో నాలుగురోజులు ఆదుకున్నారు ఆ గ్రామస్తులు.

ఐదో రోజున గుండెనిబ్బరం చేసుకొని నాగమణి ఇంటికి చాకిరీకి వెళ్ళక తప్పలేదు రాఘవమ్మకు.

ఆ మధ్యాహ్నం రామానుజం గారి పేరున ఏదో ఉత్తర మొచ్చిందంటూ పోస్టుమేను ఒక ఉత్తరం అందించాడు.

ఘొల్లుమంది రాఘవమ్మ "ఆయనగారి కాలం తీరిపోతుం దని తెలియని స్నేహితు డెవరో రాసుంటాడు నాయనా!" ఆ ఉత్త రాన్ని పిడికిట నలిపి "ఇంకెక్కడి రామానుజంగారు నాయనా?" అంటూ నెత్తి కొట్టుకుని ఏడ్చింది రాఘవమ్మ.

"ఊరుకో తల్లీ- ఊరుకో, పోయినవారు తిరిగి రారు. ధైర్యం కూడగట్టుకోవాలి తల్లీ! ఇలాంటి పరిస్థితుల్లో, మరి నే నెళ్ళొస్తా నమ్మా!" అని కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయాడు పోస్టమేన్.

గతించిన భర్తను, గతించిం దనుకొన్న కోమలిని తలంచుకొని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది రాఘవమ్మ. ఒకింత భారం తగ్గాక ఆ ఉత్తరం వ్రాసింది ఎవరో చూద్దామని కవరు చించింది—

"అమ్మా!" అన్న సంబోధనా, 'విషయాలు బయటకు పొక్క నివ్వకు. నేనింకా బ్రతికే వున్నా" నన్న తొలి వాక్యము చదివి, ఉక్కిరిబిక్కిరై పోయి ఆ వ్రాత కోమలిదేనని, తిరిగి చదివి రూఢి చేసుకొని, "తల్లీ కోమలీ! బ్రతికే వున్నావా తల్లీ?" అని తనలో తానే గొణుక్కుని తర్వాత వాక్యం చదివి ఆశ్చర్యపోయింది,

"జరిగిన ఘోరాన్ని నీతో చెప్పుకోలేక పోయానమ్మా! నన్ను క్షమించు" అంటూ మొదలు బెట్టి, ముకుందరావు చేసిన ద్రోహాన్నంతా పూస గుచ్చినట్టు వివరించి "ఇక ఆ వూళ్ళో వుంటే ఆనీచుడు నన్ను విడువడమ్మా! ఈ రహస్యం ఎన్నాళ్ళో దాగదు. మన కుటుంబ గౌరవం మంట గలుస్తుంది. ఏ రకంగా చెడ్డా నేను చెడ్డదాన్నే, కాని ఆ కళంకం కుటుంబానికంతా ఆపాదిస్తారమ్మా! నా మూలంగా నా చెల్లెళ్ళ బ్రతుకు నాశనంగావటం నాకిష్టం లేదు. అందుకని నేనొక నిర్ణయాని కొచ్చాను. నా నిర్ణయాన్ని నీవు ఆమోదించవని నాకు తెలుసు. అందుకే నన్ను క్షమించమని కోరుతూ ఈ సంజాయిషీ చెప్పుకుంటున్నాను.ఆ వూళ్ళో ముకుందరావు బారి పడకుండా తప్పించుకో లేనని ముందే రాశానుగా? ఒక వేళ తప్పించుకోగలిగానేఅనుకోగుట్టుగా బ్రతికి మలినమైన ఈ శరీరంతో మరొకర్ని మోసం చేయలేను గదా? ముకుందరావు ఎలానో అల్లరి పెట్టేస్తాడు.

చెడిపోయిన దాన్నని తెలిసి తెలిసి ఏ పురుషుడూ నన్ను చేపట్ట డానికి ముందుకి రాడు. అలాంటి ఆదర్శ పురుషులు ఈ మధ్య కథల్లో దండిగా కనిపించినా ఏ కోటికో, ఒక్కడైనా ఉన్నాడో లేదో! నా బ్రతుకు నాశనమైన మాట వాస్తవం అని గుర్తించాక ముందు ఆత్మ హత్యే శరణ్యమని పించింది గాని-నాన్నా పోయి, నేనూ పోతే పసి బిడ్డలతో నీ బ్రతుకు మరెంత బాధాకరమౌతుందో, మరెంత హీనమైపోతుందోనని ఊహించుకొని వాణికి పోయాను.

నా శరీరమైతే మలినమైంది గానీ, నా మనసు మలినం కాలేదమ్మా! తండ్రి తర్వాత ఆకుటుంబ బాధ్యత నాది అనే జ్ఞానం నాలో వుంది. దుర్భరమైన జీవితానికి నిన్నూ చెల్లెళ్ళనూ వదిలేసి నా దారి నేను చూసుకోదలచుకోలేదు. చెడిన శరీరం చెడనే చెడింది. చెరచిన ముకుందమే ఒక సలహా ఇచ్చి తెలియక మేలు చేశాడు. ఈ శరీరాన్నే అమ్ముకొని అధికంగా ఆర్జించి నీ కష్టాల్లో నిన్నాదుకోవాలనే దృఢ సంకల్పంతో ఇక్కడికొచ్చి ఈ వ్యభిచార వృత్తి చేపట్టానమ్మా-నన్ను క్షమించు.

'ఈ చెడిన శరీరం ఈ రకంగా నన్నా సద్వినియోగపడితే చాలు- అన్న తృప్తి మినహా, నాలో మరే కోరికా లేదమ్మా! కామాంధ

కారంతో కులకడానికి వెళ్ళానని ఈసడించుకోకమ్మా! నిజానికి నే నిప్పుడున్నది నరకమమ్మా, నరకం. కోరికలు వెర్రి తలలు వేసిన కామాంధుల వికృత వికారాది చేష్టలను సహనంతో భరిస్తూ, ప్రకృతి ఆపాదించిన సౌఖ్యాన్ని కష్టంగా తారుమారు చేసుకున్న బ్రతుకునాది. నాదనే కాదు, ప్రతి వ్యభిచారిణి బ్రతుకూ అంతే నేమో? ఇంతకు మించి వ్రాయలేను.

ఈ పాటికి ఊరు నన్ను మరిచే వుంటుంది. వాళ్ళను మార్గం మళ్ళించి మరోలా ఊహించడానికే ఆ చీటి రాసి వచ్చాను గాని, నీ వెంతగా కుమిలిపోతావో ఊహించి చాలా బాధపడ్డాను. అయితే తప్ప లేదు. ఈ రహస్యాన్ని చెల్లెళ్ళకు కూడా తెలియనీకు. ఈ ఉత్తరం వ్రాస్తున్న నాటికే రెండు వందలు ఆర్జించాను. దిగువ వివరంగా నా చిరునామా ఇచ్చాను. ఏబంధువుల వద్దకో వెళ్తున్నానన్న వంకన నా దగ్గరకు ఒక్కసారి రావూ? వచ్చి నే నందించే సహాయాన్ని అందుకో అమ్మా! నీవు వచ్చేనాటికి అది మరింత కావచ్చు! పాపిష్టి సొమ్ము అనుకోకమ్మా! ఈ జన్మకి నా కింక వేరే కోరికేదీ లేదమ్మా! చెల్లెళ్ళూ, నీవూ సుఖంగా బ్రతకాలి. అమ్మా! గ్రహించు. ముఖ్యంగా నిన్ను చూడాలనివుంది. అమ్మా, రావూ?" అంటూ ముగిసింది కోమలి ఉత్తరం.

రాఘవమ్మ కడుపు చెరువే అయ్యింది.

* * *

"సంసారిని అంటే సంసారాన్ని తెచ్చుకుంటావని. ఇల్లిచ్చాను గానీ, ఇలా పెళ్ళాన్నెక్కడో వదలి ఒంటరిగా నీవే చెయ్యి కాల్చుకుంటానంటే అసలు ఇవ్వకనే పోదును. ఆడదిలేని ఇల్లు ఇల్లే కాదయ్యా. ముంగిట ముగ్గూ లేక, సరియైన తుడుపూ లేక ఏవిటయ్యా? ఇది ఇల్లటయ్యా? పాడడిపోయిన కొంపలా తయారౌతోంది. పక్కన నాకుండడానికే కష్టమౌతోంది. ఏమంటావ్?" అని మళ్ళీ మొదలెట్టింది సాధింపు ఇల్లుగలావిడ నాంచారమ్మ.

"చెప్పాను గదండీ—అవతల నా తమ్ముడి పెళ్ళి దగ్గర కొచ్చేసిందని. ఇంకెంత? ఒక్క నెల రోజులు" అని సంజాయిషీ చెప్పుకున్నాడు కామేశ్వర్రావు.

"ఇదుగో అబ్బాయ్, నే నసలే మగ దిక్కులేని దాన్ని. నీ కన్నా వయసున పెద్దదాన్నే అనుకో, అయినా నీ నిలా నాపక్కన ఒంట

రిగా గడిపేస్తుంటే ఈ లోకం వుంది చూశావూ? రే పొద్దునది ఏదో కారుకూత కూసేస్తుంది. ఇల్లు ఖాళీగా పడుంటే పడుంటుంది గాని రే పొద్దున్నే ఖాళీ చేసి పారెయ్, పెళ్ళాన్ని తెచ్చుకోవడం వీల్లేక పోతే. అంతే, అంతే మరి....” ఖండితంగా చెప్పేసింది నాంచా రమ్మ.

“మీ రంతగా ఇబ్బంది పెడితే” నసిగాడు కామేశ్వరరావు.

“అదిగాదబ్బాయ్. పోనీ, నీ పెళ్ళా మొచ్చి ఒక పూటుండిపోతే అదెలాగుంటుంది చెప్పు. 'అవతల మరిది పెళ్ళట-వెళ్ళకేం జేస్తుంది? నాల్రోజులు పోయాక మళ్ళీ వస్తుంది' అని అడిగే వాళ్ళకు నేనే చెప్పుకుంటాగా?” అన్నది నాంచా రమ్మ. తన బాధ తనది.

“ఏవమ్మా, ఇంకా పెళ్ళాన్ని తెచ్చుకున్నాడు గాదేం ఆ కామేశ్వ ్రావు?” అని అదోలా అదో రకంగా అడుగుతున్నారు ఇరుగు పొరుగు మరి.

“కాలక్షేపం గాని ఐపోతోందా ఏం?” అనే వ్యంగ్యం ధ్వనిస్తుందా మాటల్లో-అదీ నాంచారమ్మ మంట!

పాపం కామేశ్వ్రావు చాలా మంచివాడని ఆమె చూస్తూనే వుంది.

అందుకనే ఇన్నాళ్ళూరుకుంది.

నాంచారమ్మ ఆ మాటనగానే ఏమనుకున్నాడో ఏమో, “అలాగే లెండి, రేపొక మాటొచ్చిపొమ్మని టెలిగ్రాం యిస్తాను” అనేశాడు. కామేశ్వ్రావు.

“మంచిమాట నాయనా, సంతోషం” అనేసింది నాంచారమ్మ.

మరునాడు ఆఫీసుకెళ్తూ “మధ్యాహ్నం మూడింటికో నాలుగింటికో మాఆవిడొస్తుంది. వస్తే ఈతాళా లివ్వండి. నేను ఆరుదాటాకగాని రాలేనని చెప్పండి” అంటూ తన వాటా తాళాలిచ్చాడు కామేశ్వర రావు.

“ఏం ఉద్యోగాలయ్యా పాడు ఉద్యోగాలు-క్షణం తీరిక దొరకదు. అయినా పెళ్ళామొస్తుందన్నా ఒక పూట శలవు దొరకదా? ఓగంటైనా ముందు వదలరా?” అన్నది నాంచా రమ్మ.

“ఏవిటోలెండి. మరినేవుంటా” అని నవ్వేసి వెళ్ళిపోయాడు కామేశ్వరరావు.

మూడింటికే రిక్షాదిగి “ఏవండీ, నాంచారమ్మగారిల్లిదేనా” అంటున్న అందాల భరిణెను చూసి “రంభ లాంటి పెళ్ళాన్నిబెట్టుకుని ఇక్కడే కుర్రాడు ముక్కుమూసుకుని జప మెలా చేయగలుగుతున్నాడబ్బా?”

అని లోలోపల ఆశ్చర్యపోయి "రామ్మా! రా! మీ ఆయన చెప్పే వెళ్ళాడులే, ఈ పూటనీవొస్తావని. ఇవిగో తాళాలు. ఇదేనా రావడం? బస్సులోనా? రైలులోనా?" అంటూ తాళాలందిస్తూ పరామర్శించింది నాంచారమ్మ.

"బస్సులోనేనండీ. నా పేరు సుమతి. మా వారిప్పుడప్పుడే రారా?" అని అడిగింది సుమతి.

"ఆరు దాటాగ్గాని రానన్నాడమ్మా! ఏమాఫీసులో,ఏంపాడో?" అన్నది నాంచారమ్మ.

"ఏవిటో ఈ ఆడ దిక్కులేని సంసారాలు. చూడండి, ఆ ముంగిలెలాగుందో? ఉండండి. ఇల్లు వాకిళ్ళు శుభ్రం చేసుకోవాలి ముందు" అంటూ సుమతి తలుపు తెరచి లోపలి కెళ్ళుంటే-

"అంతే నమ్మా మరి. అదే నా గోల. పెళ్ళాన్ని తెచ్చుకోవయ్యా అని పోరెట్టగా పోరెట్టగా నిన్ననిచ్చాడు టెలిగ్రాం నీకు నీ మొగుడు" వాకిట్లోనే నిలబడి అన్నది నాంచారమ్మ.

చీపురు తెచ్చి వాకిలి తుడుస్తూ- "ఏదండీ, అవతల నా మరిది పెళ్ళా! పైగా మా అత్తగారు లేవలేని మనిషా? ఇంకెంత లెండి, ఒక్క నెల రోజులు" అంటూ వాకిలి తుడవనారంభించింది సుమతి.

"అయ్యో, మీ అత్తగారు లేవలేని మనిషా? నాకు తెలియదు సుమా?" నొచ్చుకుంది నాంచారమ్మ.

"ఏదోలెండి, ఒక్క రోజుకి ఎలాగో ఒక లాగ వాళ్ళే సర్దుకుపోతారు" అన్నది సుమతి.

"ఏవిటీ? ఒక్క రోజంటే ఒక్క రోజేనా? రేపేనా తిరుగు ప్రయాణం?" అన్నది నాంచారమ్మ.

"టెలిగ్రామిచ్చారని తప్పనిసరై వచ్చాను గానీ, అక్కడ చాలా ఇబ్బందులున్నాయండీ" అన్నది సుమతి.

"అయ్యో తల్లీ! దీని కంతటకీ నేనే కారణం సుమా" బాధపడింది నాంచారమ్మ.

"అదేం మాటలెండి. ఆయనటు రాలేక, నేనిటు రాలేక చివరికాయన ఉండలేక ఆ టెలిగ్రామిచ్చుంటారు లెండి!" అంటూ నవ్వింది సుమతి.

"అదీ ఒక మాటేననుకో, అయినా...." అంటూ తాను తెచ్చిన ఒత్తిడి గురించి చెప్పుకుపోయింది నాంచారమ్మ.

ఏదో పిచ్చాపాటీ కొంచెం సేపు కబుర్లాడుకున్నాక వంట చేసుకుంటానంటూ ఇంట్లోకి పోయింది సుమతి.

ఏ నాడో కన్న కలల పంట!

చుట్టూతా ప్రపంచం కనుల పండుగగా వుంది సుమతికి.

చకచకా పనులు చేసుకుపోయింది.

కామేశ్వర్రావు ఒంటరిగా వున్నా వంట చేసుకుంటున్నాడు గనక ఇంట్లో అన్నీ సిద్ధంగా వున్నాయి.

పనులు ముగించుకొని హేండ్ బేగ్‌లో తెచ్చుకున్న మారు జతతో ముస్తాబై ముద్దుగా గుమ్మంలో నిలబడింది సుమతి భర్త రాకకై ఎదురు చూస్తూ.

ముచ్చట పడిపోయింది నాంచారమ్మ.

సుమతిని చూసి ఆశ్చర్యపోయాడు కామేశ్వర్రావు.

ఆమెలో ఎంత మార్పు!

"పెల్లిగ్రాం అందడం రావడం కూడా జరిగిందన్న మాట! ఎన్నింటికోయ్ రావడం?" చిరునవ్వుతో పలకరించాడు కామేశ్వర్రావు.

"అదేవిటండీ, అంతలా చిక్కిపోయారు" అని ఆశ్చర్యపోయింది.

సుమతి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడం మానేసి "ఏవిటీ ఒక రోజుకే?" అని సుమతిని చూసి నవ్వేసి అప్పుడే వెలుపలి కొచ్చిన నాంచారమ్మతో, "ఏవండీ! మీరు చెప్పండి—నేను చిక్కిపోయానా?" అన్నాడు.

కామేశ్వర్రావు అంటున్న మాటలు వింటూనే బయటికొచ్చిందేమో "ఏవిటి ఒక్క రోజంటావేమిటబ్బాయ్? నీకు ఒక్క రోజులాగుందా? ఈ ఇంట్లో దిగే నెల దాటి పోయె. అంతకుముందెన్ని రోజులు పెళ్ళాన్ని అజగట్టుకోలేదో? అయినా రోజూ చూస్తున్న నాకు నీవు చిక్కావో, బలిసావో ఎలా తెలుస్తుంది? నీ పెళ్ళామన్న మాటే ఖాయమై వుండాలి" అంటూ నవ్వింది నాంచారమ్మ.

"పొద్దుట ఏవేళప్పుడు తిన్నారో రండి, స్నానం చేసి భోం చేద్దురు గాని. వేణ్ణీళ్ళు సిద్ధంగా వున్నాయి" అన్నది సుమతి.

'ఔను గదూ, అమ్మాయుందేది ఈ ఒక్క రోజే గదూ! నేనే విటి మధ్య పానకంలో పుడకలా' అని మనసులోనే అనుకొని "వెళ్ళు నాయనా, వెళ్ళు. ఉంటానమ్మా సుమతీ, అవతలవంటింకా కాలేదు" అంటూ నిష్క్రమించింది నాంచారమ్మ.

లోపలికి రాగానే సుమతిని గాఢంగా ముద్దు పెట్టుకొని "అబ్బ! ఎంత అందంగా వున్నావ్! ఎంత ముద్దుగా వున్నావ్! ఎంత కొత్తగా

వున్నావ్!" అని ప్రశంసించాడు కామేశ్వర్రావు.

సుమతి నిండుగా తృప్తిగా నవ్వి "అంతామాత్రం పనికిరాదు లెద్దురూ. ముందు స్నానం కానిచ్చి రండి. భోంచేశాక మీయిష్టం" నవ్వింది సుమతి.

"అమ్మ! ఈవేళ ఒక్కనిమిషం వృధాగా పోనివ్వడమే?" అంటూ నబ్బు టవలని వెదుక్కో సాగాడు కామేశ్వరరావు.

"ఏవండీ, ఈ వేళ నేనిక్కడు న్నాను. అవన్నీ స్నానాల గదిలో సిద్ధంగావున్నాయి."

"ఏవిటేవిటీ? గుడ్. వెరీ గుడ్. ఔను గదూ. సతీమణిగా రొచ్చారు గదూ?" అని సుమతికేసి కొంటెగా చూపి,కన్నుగీటి స్నానాని కెళ్ళాడు. "పోదురూ" అంటూ ముసిముసిగా నవ్వింది సుమతి.

"వడ్డించు- వడ్డించు," అంటూ వడివడిగా వచ్చిన కామేశ్వరరావు సుమతి తనొక్కడికే వడ్డించడం చూపి"అదేవిటి? నీవు కూడా వడ్డించుకో.మళ్ళా అదొక ఆలస్యమా?" అన్నాడు.

"ముందు మీరు తిందురూ" అంది గోముగా సుమతి.

"చాల్లేవోయ్, కూచో కూచో, నీవు కూడా"

"తిందురూ. ముందు భర్త, తర్వాత భార్య. అయినా ఆవిడ గారుచూస్తే బాగుండదు."

"అబ్బో, పతివ్రతా శిరోమణి!"

"ఏవండీ!"

కళ్ళెత్తి చూశాడు కామేశ్వర రావు.

ఆమె కళ్ళల్లో కోపం లేదు. కాని ఆమె కళ్ళు చెమ్మగిలి నట్లు స్పష్టంగా అగుపించాయి.

"అలాంటి మాటలని నన్ను కష్ట పెట్టకండి. పెట్టరు గదూ?" అని ప్రాధేయపడినట్లు అడిగింది సుమతి.

"సరేలే, వడ్డించు. లేనిపోని ఆలస్యం ఎందుకని గదూ" గొణిగాడు కామేశ్వర్రావు.

తినడం ప్రారంభించిన కామేశ్వరరావు ఆశ్చర్యపోయాడు.

ఎన్ని రకాలు చేసింది సుమతి! ఎంత రుచిగా వున్నాయి వంటకాలు!

అతడు భోంచేస్తున్నంత సేపూ తను రావడంతో ప్రారంభించి నాంచారమ్మను పలకరించడం వగైరాలు, వంట ముగించడం వరకూ జరిగిన వన్నీ చెప్పుకుపోయింది సుమతి.

కమ్మని భోజనంతో పాటు కమ్మని మాటలు!

"ఎందు కింత శ్రమ తీసుకుని

ఇన్ని రకాలు చేశావు సుమతీ?" తృప్తిగా భోంచేసి లేస్తూ అడిగాడు.

"అదేవిటండీ? మీ కోసం" అని ముసి ముసి నవ్వులు నవ్వింది సుమతి.

ముద్దొచ్చిన కామేశ్వర్రావు నిగ్రహించుకొని "తిను, తిను. వేగిరం కానియ్" అవి తినేసేలా చూశాడు.

"ఎంతండీ, ఒక్క క్షణం. వద్దంటే అదీ మానేస్తాను"నవ్వింది సుమతి.

"అబ్బో! అమ్మాయిగారికి తొందరగా వుందన్నమాట?"

"ఉండదేమిటి మరి?" కవ్వించింది సుమతి.

సుమతి ఆదరా బాదరాగా తింటుంటే "ఫర్వాలేదు నెమ్మదిగా తిను" అని నవ్వాడు కామేశ్వర్రావు. అతడు తెచ్చుకున్న ఓపికను చూసి ఆశ్చర్యపోయింది సుమతి.

అంతా ముగిశాక సున్నితంగా ఆమెను అక్కున జేర్చుకొని పక్కమీదికి చేర్చాడు కామేశ్వర్రావు.

సిగ్గునభినయించింది సుమతి.

"ఏం? కొత్తా - భయమా?" ఆమె బుగ్గల పొడిచాడు కామేశ్వర్రావు.

"పోదురూ; అలాటి మాటలే అనొద్దన్నాను" అంటూ అతగాడి నోరు నొక్కింది సుమతి.

కామకేళి పరాకాష్టలో "ఏవండీ ఏవండీ.." అంటూ కామేశ్వర్రావుని గుండెలకు అదుముకొని తృప్తిగా నిట్టూర్చింది సుమతి.

స్త్రీని సంతృప్తి పరచగలిగా నన్న విషయం పురుషునికి మహా గర్వకారణం.

సుమతి కేసి సంతృప్తిగా చూశాడు.

ప్రేమగా గిల్లాడు.

కిలకిలా నవ్వింది సుమతి.

ఆ రాత్రి వృథా పోనివ్వగూడదనుకున్న కామేశ్వర్రావు కబుర్లలోకి దిగాడు.

ఆమెను యెందుకు రప్పించాల్సొచ్చిందీ చెప్పసాగాడు.

"తెలుసుగా- ఇంకేమన్నా చెబుదురూ?" అన్నది సుమతి.

"ఇంకే వుంటాయ్?"

"మీ గురించి ఏవన్నా?"

"నా గురించా! నా గురించి చెప్పాల్సిన వేవుంటాయ్? అయినా నీకు చెబితే నష్టమేమిటిలే" అంటూ తన గత జీవితానుభవాలు చెప్పనారంభించాడు.

అలా మధ్య మధ్యలో కాలక్షేపం చేస్తూ తెల్లవార్చాడు.

తెల్లగా తెల్లవారే ముందు కామేశ్వర్రావుకి కునుకు పట్టేసింది.

సుమతి లేచి యింటి చాకిరీ చేసుకొని కాఫీ టిఫిన్లు సిద్ధంచేసి ఆయనకు నిద్రాభంగం కలిగించడ మెందుకని వంట కుపక్రమించింది.

ఈలోగా నాంచారమ్మ 'ఎప్పు డమ్మా వెళ్ళేద' నడిగితే 'ఈవేళ కూడా వుండి పోతాలెండి' అన్నది సుమతి.

"అంతేలే, మరీ ఒక్కరోజే విల్లే?" అని నవ్వింది నాంచా రమ్మ.

బారెడు పొద్దెక్కి లేచిన కామే శ్వర్రావు తృళ్ళిపడ్డాడు.

"ఏదీ?సుమతేదీ?"అనుకొంటూ వంట గదిలో కొచ్చిన కామేశ్వ ర్రావు తీరుబాటుగా వంట చేస్తున్న సుమతిని చూసి ఆశ్చర్యపోయాడు.

"అదేవిటి? నన్ను లేపకుండా ఇదంతా ఏవిటి, ఈ వంటా గింటా? నీకు ఆలస్యమైపోలేదూ?"అన్నాడు.

"అలసిపోయారని .... " అని నవ్వి "ఇవ్వేళ్టికి నేనుండిపోతాను" అన్నది సుమతి.

"సుమతీ!"

"గాభరా పడొద్దు లెద్దురూ! ఈ ఒక్కరోజుకి మీకేమీ భారమై పోను".

"అదిగాదు...."

"నాకు తెలుసు లెద్దురూ? చెప్పాగా. దయచేసి గొడవచేయ కండి. ఇంటావిడతో కూడా చెప్పాను."

"సుమతీ!"

"ఇవాళొక్కరోజే."

సుమతితో మరో రోజు గడపా లన్న కోర్కె అతడికి రాత్రే కల్గి గింది.

కాని....

కాని....

"సరేలే" అన్నాడు.

"ఏవండీ!" అంటూ సుమతి అతణ్ణి అమాంతంగా వాటేసుకుని ముద్దుపెట్టింది.

కాఫీలయ్యాక కబుర్లతో కొంచెం సేపు కాలక్షేపం చేసితృప్తిగా భోం చేసి ఆఫీసు కెళ్ళాడు కామేశ్వ ర్రావు.

రెండవ రాత్రి ఆనందంగా గడి చింది.

* * *

కామేశ్వర్రావు ఒకప్పుడు బాగా కలిగినవాడు. చిన్నప్పుడే ఆస్థి చేజిక్కి నందున చెడిపోయినవాడు. బెల్లంచుట్టూ చీమ లన్నట్టు, చేరిన చెడు సావాసగాళ్ళందరికీ కలిపి ఖర్చులు తానేపెట్టి కరిగిపోయాడు. బాగా చితికిపోయాక తెలివి తెచ్చు కొని బ్రతకడానికి మరో మార్గం

లేదని తెలుసుకొని చిన్న నౌఖరీ సంపాదించి బుద్ధిగా బ్రతుకు తున్నాడు. తన నడతను దిద్దు కుంటూ ఇంత సంపాదించి తన గత వైభవాన్ని తిరిగి పొందాలనే తపనతో అల్లరి చిల్లరి వేషాలన్నీ మానివేసి, అనవసరపు ఖర్చులు తగ్గించుకొని, వండుకు తిని గుట్టుగా బ్రతుకుతున్నాడు. ఈ ఊరొచ్చాక ఇల్లు దొరక్క అవస్థపడి అవుస రార్థం నాంచారమ్మతో చిన్న అబద్ధ మాడి, ఆ ఇల్లు సంపాదించాడు. నాంచారమ్మ పోరు పడలేక ఒక్క రోజు ఆమె కన్నీళ్ళు తుడుద్దామని సుమతిని సంప్రదించి, ఎలా నాటక మాడాలో ఆమెకు నేర్పి, ఆమెను అద్దెకు తెచ్చాడు. ఇదీ అసలు విషయం. నాటకాన్ని రక్తి కట్టిం చిన సుమతి రెండో రోజు కూడా వుంటానంటే కాదనలేకపోయాడు.

* * *

రెండవ రాత్రి కాలక్షేపంగా తన కథ చెప్పుకుపోయింది సుమతి.

దీనాతిదీనమైన తన కథను దుఃఖిస్తూ ముగించి సుమతి అన్న మాటలివి "ఏనాడో నేను కన్న కలలు కరగిపోయాయి. ఈ రెండు రోజులూ నాటకాన్నే వాస్తవంగా నమ్మి మురిసిపోయాను. మీరు పురుషులు. పతనమైన మీ జీవితాన్ని తిరిగి దిద్దు కున్నానని చెప్పారు. ఒకనాడు మీ రెంత విలాస పురుషులో తెలియపర్చారు. మీలో ఎంతటి పశుత్వ ముండేదో చెప్పారు. మీ మాటలు నమ్మ దగ్గవని మీరు సున్ని తంగా నన్ను స్పృశించిన తీరులో గమనించాను

జీవితంలో సుఖాన్ని సుఖంగా చవి చూసానంటే అది మీ తోటే. ఆ సుఖాన్ని మరో రోజు అనుభ వించాలనే కోర్కెతో ఈ రోజూ వుండిపోయాను. మీ తోటి ఈ అనుభవం జీవితాంతం నాకు మధుర స్మృతి. మీ నుండి కిరాయి తీసు కొని ఆ మధుర స్మృతిని మలినం చేసుకోలేను. నేను స్త్రీని, పతన మైనదాన్ని. నాకే గాదు పతనమైన ఏ స్త్రీకీ మీలాగా జీవితం పునర్నిర్మించు కోవడం సాధ్యం కాలేదు. ఊబిలో కూరుకుపోయిన వ్యక్తి తనంతట తాను ఊడి రాలేడు. ఎవరైనా వచ్చి సాయపడతారనే ఆశ వుండడం సహజమే గాని అది పేరాశ. నా అసలు పేరు కోమలి. కోమలత్వం నశించాక ఆ పేరును నేనే సుమతిగా మార్చుకున్నాను. మనిషిని, మన సున్న మనిషిని, అమ్మ కోసం, చెల్లెళ్ళ కోసం బ్రతుకుతున్నాను. చెల్లెళ్ళను ఈ జన్మకు తిరిగి చూడ డానికి నోచుకోలేదు.

"ఏమండీ! ఈ అభాగ్యురాలు గంజాయి వనంలో ఓ తులసి మొక్కనీ, ఉల్లిపూవుల్లో కలిసి పోయిన ఓ మల్లెపూవనీ కనీసం

మీరు గుర్తించమని నా ప్రార్థన. నా కలలు రెండు రోజులు పండించారు. మరొక్క రోజు కూడా పండిస్తానంటే అదృష్టవంతురాల్ని. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని తెలుసు. అయినా ఏవిటో పిచ్చి కోరిక. తిరిగి నరకంలో కాలు బెట్టాలే అన్నబాధ."

* * *

గెలుపు నాదే అంటూ తప్పుడు ముక్కతో ఆట చూపించి ధ్వజమెత్తుతారు కొందరు.

వాస్తవానికి ఆ ఘనత రంగు బయట బడక నటించే ఆ తప్పుడు ముక్కదే.

నాంచారమ్మకు 'రాంగ్ షో' చూపించాడు కామేశ్వర్రావు.

"నీవు శాశ్వతంగా నా దానివే కోమలీ!" అంటూ ప్రపంచానికే రాంగ్ షో చూపెట్టాడు కామేశ్వర్రావు.

తప్పుడు ముక్క సుమతి సరియైన ముక్క కోమలిగా అందరి మన్ననా పొందగలిగింది. *


